## "తీరా ఖాళీచేస్తే…"

## 4

చుర్రుమని చెంపకు తాకుతున్న ఎండతోబాటు వినపడ్డాయి సీతమ్మ మాటలు కామాక్షికి. "కామాక్షీ, మీ మామయ్యగారు పిలుస్తున్నారమ్మా" అంటూ. జవాబు చెప్పకుండా పంపు త్రిప్పి ముఖం కడుక్కో సాగింది కామాక్షి. 'వినబడలేదు కాబోసు,' అని తనలో అనుకున్నట్లుగా అన్నది సీతమ్మ. ఒక్క క్షణమాగి, "కామాక్షీ!" అని మళ్లీ పిలిచింది.

ముఖం తుడుచుకుంటూ వాళ్లగుమ్మం దగ్గరకెళ్లి "అల్లాగేనండీ- వేరే యింటికోసం వెతుకుతూనే వున్నాము. దొరకగానే ఖాళీచేస్తామని చెప్పండి" అన్నది కామాక్షి.

సీతమ్మ కొంచెం ఆశ్చర్యపోయింది, యీ అమ్మాయి యిలా తెగేసి అన్నందుకు. చాలా రోజులుగా ఆయన కామాక్షిని కేకేస్తుండడం, యిల్లు ఖాళీచేయమని చెపుతూ ఉండడం జరుగుతోంది.

"అదికాదమ్మా, ఎందుకు పిల్చారో ఏమిటో కనుక్కోరాదు?" అన్నదామె తేరుకుని.

కామాక్షి వెనక్కి తిరిగి వచ్చేస్తూ "ఇంకెందుకు పిలుస్తారులెండి! ఈ మాట చెప్పడానికే. ఇంకొకందుకైతే, మీ అబ్బాయిని పంపండి. అల్లాగే వస్తాను" అన్నది.

ఇంట్లోకి వచ్చి పడక్కుర్చీలో కూలబడింది. తల్లి కాఫీగ్లాసు పుచ్చుకొచ్చి, చేతికిస్తూ. "ఏమిటీ? మళ్లీ ఏమంటుందావిడ?" అన్నది.

"ఆ, ఏముందీ—మామూలుపాటే" అనేసి ఆలోచనలో పడిపోయింది కామాక్షి.

ఆఫీసులో వుద్యోగం చూస్తే అల్లా ఏడుస్తోంది. ఊరినుంచి నాన్న వ్రాసే పిచ్చి ఉత్తరాలు చూస్తే, మరీ వెర్రెత్తుకొస్తోంది. దరిదాపు తోచని ఈ మహానగరంలో, తనకీ సీతమ్మగారూ, సీతారామయ్యగారూ దాపురించారు.

చిన్నవాటా, ముచ్చటగావుంది, చవుక అనుకొని చేరారీయింట్లో.

ఒకటి రెండు నెలలు బాగానే సాగింది. ఒకనాటి సాయంత్రం తను ఆఫీసునుండి వస్తోంటేనే వాళ్ళబ్బాయి పరుగెత్తుకొచ్చి పిల్చాడు నాన్నగారు రమ్మంటున్నారని. వెళ్ళింది తను. ఆవిడ కాఫీ కూడ యిచ్చింది కూర్చోబెట్టి. "ఆయన లేరులే యింట్లో. నేనే రమ్మన్నాను. మీ యింటికి మధ్యాహ్నంపూట వస్తూంటూంది - ఆవిడెవరు?" అన్నది ఆరాతీస్తున్నట్లుగా.

కామాక్షికి నిజంగానే ఆశ్చర్యంవేసింది. 'మా అక్కయ్య, ఈ పేటలోనే వుంటోంది' అని తను చెప్పడం, ఆవిడ కుశల ప్రశ్నలు వేయడం చాలా రోజుల క్రితం జరిగింది.

"ఆవిడ మా పెద్దక్క. మీకు తెలీదూ?" అన్నది కామాక్షి.

"ఔనౌను. తెలుసు. మీ పెద్దక్కకాదూ? మరే! మీ మామయ్యగారు అంటున్నారూ—అస్తమానం ఆవిడాన్నూ పిల్లావచ్చి యిక్కడే కూర్చుంటే ఏం బాగుంటుందీ! నూతికి గట్టుకూడా లేదు కదా! పిల్ల ఆ పేపు వెడుతుందో ఏమిటో!" అంటూ అల్లా వదిలేసింది సీతమ్మగారు.

కామాక్షికి ఒక్క క్షణం అర్థంకాలేదు, ఆవిడనే దేమిటో. "మా అక్కవస్తే ఎవరికీ బాగుండనిదీ?" అన్నది కొంచెం ఆగి.

"అబ్బే! ఎవరికేముందీ?"అంటూ అర్థంలేకుండా గలగలా నవ్వేసి, "అదికాదమ్మా, మీ మామయ్యగారికి అన్నీ లెక్కలు—తల్లి, కూతురు వుంటామంటేకదా మనం యిల్లిచ్చాము, ఆవిడకూడా రోజంతా యిక్కడే వుంటోందేమిటీ అని. ఒకళ్ళకిద్దరు ఎక్కువైతే ఆయనకు నచ్చదు. మీరనే కాదు..." అన్నదావిడ.

కామాక్షి కాసేపు వూరుకుంది 'సరే. వస్తాను. అని లేచి ఇంట్లోకి వచ్చింది. రేపు నాన్నగారు వస్తే ఏమ్మంటారులాగుంది వీళ్ళు అని పించింది కామాక్షికి. పాప నూతిదగ్గరకు వెళ్ళకుండా చూడమని చెపుదామని కాదు వీళ్ల ఉద్దేశ్యం-అసలు అక్క రానేరాకూడదని! కామాక్షికి చాలా కోపంవచ్చింది యిది తలచుకుంటే, ఆయనకు చీకాకైతే ఆవిడా, పిల్లలూ పడతారు. డబ్బిచ్చి యిల్లు పుచ్చుకున్న మనకేమిటీ అనిపించింది.

ఆ మర్నాడు కాబోలు సీతారామయ్యగారే " కామాక్షీ ! " అని ఆప్యాయంగా కేకేసి, సీతమ్మగా రన్న ముక్కలే మరోలా అని పిల్ల, నుయ్యి గురించి మళ్ళీ ప్రస్తావించాడు.

కామాక్షి వెంటనే ''ఇల్లన్న తరువాత ఎవరేనా వస్తారూ, వెడతా రండీ. ఇక లేకపోతే ఇల్లెందుకండీ-హాస్టల్‌లోనే వుందునుకదా" అన్నది వినయంగా.

"ఔననుకోమ్మా, అయితే యిల్లు యిచ్చుకునే వాళ్ళసంగతి కూడా చూడాలికదా మరి?" అన్నాడాయన.

కామాక్షికి చిర్రెత్తుకొచ్చింది. ''ఏమిటండీ యిప్పుడు మీ కొచ్చిన కష్టం? మా యింటికేమీ త్రాగుబోతులు వచ్చి రాత్రి తెల్లార్లూ తందనా

లాడి గోలచేసిపోవడం లేదుకదా? రేపు మా నాన్నగారు వచ్చినా ఇల్లానే అంటారులావుంది మీరు?" అన్నది.

ఆయన నోరు తెరిచాడు. "మీ నాన్నగారు వస్తారా? ఎప్పుడు?" అన్నాడు.

"బాగుందండీ! మేముంటే మా నాన్నగారు చూడ్డానికి రారా ఏమిటి? ఏదో పనులుండబట్టి వున్నారుకాని మావూళ్ళో, లేకపోతే సాధ్య మైనంతవరకూ మాకు సాయంగా యిక్కడే వుంటారు" అన్నది కామాక్షి బిగ్గరగా.

ఆయన లేచాడు కుర్చీలోంచి. "ఇల్లాగైతే కుదరదమ్మాయ్, మీరు వేరే యిల్లు చూసుకోండి" అనేసి లోపలికి వెళ్ళిపోయాడు. కామాక్షి యివతలికి వచ్చేసింది.

ఇటువంటి ప్రవేశాలు, నిష్క్రమణలూ నానాటికీ ఎక్కువ కాసా గాయి. ప్రొద్దున్నే ఆవిడ, పిల్లలూ వచ్చి తండ్రి యిల్లు ఖాళీచేయమని అన్నమాటలు చెప్పేవారు. కామాక్షి ఆఫీసుకి వెళ్ళగా చూసి సీతమ్మ గారు వారింటికీ, తమ వాటాకి మధ్యగానున్న తలుపు తెరచి 'పిన్నిగా[illegible]!' అని కేకేసేది. ఆ మాటా, ఈమాట చెప్పి, "మీ కామాక్షితో చెప్పారా? ఇల్లు ఖాళీచెయ్యాలన్నమాట" అనేది. దగ్గర బంధువులెవరో వున్నారుట. వాళ్ళకీ వాటా యివ్వాల్సివుందిట.

ఇల్లాగ అస్తమానం యిల్లు ఖాళీచేయమని పోరేకాక, సాయంత్రం వేళల బల్బులు ఎంతెంత పవరున్నవి వేశారో చూడడం, ఏయే గదుల్లో దీపాలు వెలుగుతున్నాయో, ఎవరున్నారో చూసి రమ్మని పిల్లల్ని పంపడం—వంటి అంతులేని అజమాయిషీ కూడా ప్రారంభమైంది.

“ఉన్న గదిలోనే లైటు వెలిగించుకోమని ఆయన అన్నారండీ, కరెంటుబిల్లు బోలెడవుతోంది” అని ఆవిడ చెప్పడం.

ప్రొద్దున్నే పని మనిషి చిటపటలాడుతూ వచ్చింది. “గిట్టయితే నావల్లకాదండీ ఈ కొలువు!” అన్నది కామాక్షిని చూసి.

“ ఏమైంది ? ” అన్నది కామాక్షి-రానున్న ఉపద్రవానికి భయ పడుతూ. తెల్లవారు ఝామున వచ్చి పనిచేసుకోవాలందిట సీతమ్మగారు. ఇంత పొద్దెక్కి-వస్తే మడితో యిటూ అటూ తిరగడానికి వీల్లేకుండా వుంది. పైగా పిల్లలు ముఖాలు కడుక్కు-నేవేళ యీ అంటగిన్నెలు పడేసుకు కూర్చుంటే వల్లకాదు-అన్నదట.

ఇదంతావిని, ముఖాలు చూసుకున్నారు కామాక్షి, తల్లి-కామాక్షికి చటుక్కు-న తక్షణ కర్తవ్యం స్ఫురించింది. “ ఔను-చీకటితోనే వచ్చి చేసుకో. నీకూ, మాకూ కూడా సుఖం. నువ్వు మరోయిల్లు కుదుర్చుకున్నా మాకు ఫరవాలేదు ” అన్నది. దాని కిదేమో నచ్చలేదులా వుంది-ముఖం మాడ్చుకుని వెళ్ళిపోయింది అవతలికి.

ఐతే యీ ఉపాయం ఎందుకూ పనికిరాలేదు-తెల్లవారుఝామునే పెద్దపెద్ద కేకలెడుతూ దొడ్డివేపు తలుపు తెరిచాడు సీతారామయ్యగారు.

“ఊరు తెల్లారకమునుపే ఏమిటా బరబరమని అంట్లు తోమడం? చీకట్లో ఏ పురుగో నీ మీదపడితే ఆ పాపం మాకు చుట్టుకుంటుంది. అమ్మాయిగారు ఆఫీసుకి పదింటి కెళ్లాలంటే, యిప్పట్నించీ చేస్తేగాని పని తెమలదా ఏమిటీ?” అంటూ ధాంధూంలాడాడాయన. “ఇలాగైతే కుదరదు, వాళ్ళని వెళ్లిపొమ్మని చెప్పు” అంటూ భార్యతో గట్టిగా అన్నాడు.

ఈ స్థితిలో యింక బ్రతకడ మెలాగో అని దిగులుపడి ఫైలువంక చూస్తూ కూర్చున్న కామాక్షిని పక్క సీటులోని అమ్మాయి పలుకరించింది. "ఏమండీ! అల్లా వున్నారు:" అని. కదలిస్తే చాలు, గలగలమని రాలే చెట్టు ఆకుల్లాగా, పలుకరించిన వాళ్ళకల్లా చెప్పుకునేందుకు కొల్లలుగా వున్నాయి కామాక్షి కష్టాలు. అన్నీ చెప్పింది ఆ అమ్మాయికి. ఆ అమ్మాయి కాస్సేపు ఆలోచించి, అంతగా అయితే సాయంత్రానికే ఖాళీచేసేసి వాళ్ళింటికి వచ్చేయమంది. "ప్రక్కనున్న రెండు గదులూ ఖాళీచేసిస్తాము, రెణ్ణెల్లపాటుండవచ్చు" అన్నది. ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడికి గడ్డిపోచ ఆధారం దొరికితే చాలు. కానీ - ఆ అమ్మాయి రమ్మంది కదా అని అల్లా పడిపోవడమేనా అనిపించిది.

సాయంత్రం యింటికిచేరి, వాడిపోయిన తల్లిముఖం చూడగానే ఈ సంకోచం తీరిపోయింది కామాక్షికి. వెళ్ళిపోవడమే శరణ్యమని పించింది. చేతిలోని పర్సు అక్కడే పడేసి సీతారామయ్యగారి వాటావేపు వెళ్ళింది-ఆయన పడకుర్చీలో పడుకుని పేపరు చూసుకుంటున్నాడు.

"మేము రేపొద్దున్నే యిల్లు ఖాళీచేస్తామండీ! మీ బంధువు లెవరినో ప్రవేశపెడతానన్నారు కదూ? కబురు పెట్టుకోండని చెబుదామని వచ్చాను" అన్నది కామాక్షి నిదానంగా.

ఆయన పేపరు క్రిందకుదించి చూశాడు, ఆమెవంక. "కూర్చో" అన్నాడు ఎదురుగా వున్న కుర్చీ చూపించి.

''ఏమిటీ? రేపా? వెడతారా?'' అన్నాడాయన.

'' ఔనండీ. మామూలంగా మీకు యిబ్బంది దేనికి?'' అన్నది కామాక్షి.

పేపరు మడిచి క్రిందపడేసి కామాక్షి వంక సాలోచనగా చూశా డాయన. "ఇంత అర్ధాంతరంగా మీరెళ్ళిపోతే, ఎల్లాగు?" అన్నాడు.

"ఓహో! నాకేం తెలుసండీ? ఖాళీచేయమని రోజూ చెపుతున్నారు కదా అని నేను మరోచోట యిల్లుచూసి, అడ్వాన్సు యిచ్చేసి వచ్చాను. నే నిప్పుడు వెళ్ళకపోతే అది దండగైపోతుంది. చాలా బాగుంది ఆ యిల్లు" అంటూ తడుముకోకుండా అల్లేసింది కామాక్షి.

ఆయనలేచి, "ఉండు" అంటూ లోపలికి వెళ్ళాడు. కాసేపటికి సీతమ్మగారు, ఆయన యివతలకు వచ్చారు.

"ఔనమ్మాయి! యిల్లా వెళ్ళిపోతే ఎల్లాగూ? వీధిలో వాళ్ళంతా మేము పోట్లాడి తరిమేశామనుకుంటే ఎంత అప్రతిష్ఠ! మరొకరు వస్తారా యీ వాటాలోకి?" అన్నది.

కామాక్షి తనను తను గిల్లుకుని చూసుకుందా మనుకుంది. "అదంతా నాకేం తెలుసండీ? రోజూ యిల్లు ఖాళీచేయమని మీరు చెబుతూంటే, ఉండడానికి మాకే మొఖమాటంగా అనిపించి యివాళ సెలవు పెట్టి రోజంతా తిరిగాను. ఎల్లాగో దొరికింది ఓ యిల్లు. పైగా అడ్వాన్సు కూడా దండుగైపోతుంది" అన్నది.

సీతారామయ్యగారికి కోపం వచ్చింది. "మీ యిష్టమొచ్చినప్పు డల్లా వెడతామంటే ఎలాగ? వచ్చే నెలలో వెళ్ళండి. లేకపోతే మా అద్దె దండగైపోతుంది. ఎవరిస్తారు ఓ నెల అద్దె?" అన్నాడు గట్టిగా.

కామాక్షి కూడ కంఠం హెచ్చించింది. "అంతగా కావాలంటే ఓ నెల అద్దె పారవేసి పోతాం. ఈ సాధింపులు పడుతూ కూర్చునేకంటే అదే నయం" అన్నది.

"మేము ముష్టివాళ్ల మనుకున్నారా ? డబ్బు ముఖాన పారేసి పోడానికి ! వెధవ నలభై రూపాయలకోసం కక్కుర్తి పడేవాళ్ల మనుకున్నారా?—మా బంధువులు వస్తేవస్తారు. లేకపోతేలేదు. అదంతా నీ కనవసరం. ఇల్లా హఠాత్తుగా ఖాళీచేసి పోవడానికి వల్లకాదు-తెలిసిందా?-వాళ్లమ్మగారితో చెప్పవే నే నిల్లా అన్నానని-మరీ తమాషాగా వున్నదీ వ్యవహారం" అని కేకలేస్తూ, ఆయన యింట్లోకి వెళ్లిపోయాడు. కామాక్షి వంక చురచుర చూసి, ఆవిడా యింట్లోకి వెళ్లింది.

—మర్నాడు ప్రొద్దున్నే సీతారామయ్యగారి పిల్లలు గేటు దగ్గర్నుంచి యింట్లోకి పరుగెత్తుకెళ్లారు. సీతమ్మగారూ, సీతారామయ్యగారూ బయటకు వచ్చారు కంగారుగా. బండిలోంచి పడక్కుర్చీ కనిపిస్తోంది. ముందువేపునుంచి రేకుబాయిలరు కనిపిస్తోంది. బండివాడు తాళ్లేసి కడుతున్నాడు వాటిని. కామాక్షి ఒక రిక్షావాడితో మాట్లాడుతోంది.

చడీ, చప్పుడు కాకుండా యీ పనంతా ఎప్పుడు చేశారన్నట్లు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారా భార్యాభర్తలు.

రిక్షాలో ఎక్కిన కామాక్షితల్లి "వస్తామమ్మాయ్" అని కేకేసింది.

"వస్తామండీ, నమస్కారం" అని కామాక్షి చటుక్కున రిక్షా ఎక్కింది.